

# పూల బాట

పరేష్. ఎన్. దోషి

పువ్వులు!

ఎక్కడ చూసినా పువ్వులే!

గులాబి పువ్వులు! ముళ్ళు లేని గులాబీలు.

నేలంతా పరచిన గులాబీల మీద మొదటి అడుగువేశాడు.

అనుకున్నాడూ, "ఆ అనుభవం అహ్లాదకరంగా వుంటుంది! అద్భుతంగా వుంటుంది! స్వర్గతుల్య ప్రపంచంలో విహారంలా వుంటుంది."

కాని, అతని ఆలోచనలు తారుమారయ్యాయి.

పువ్వుల మీద కాలు మోపగానే కాళ్ళు కాలినట్లనిపించింది. గులాబీల మీద కాకుండా నిప్పుల మీద నడిచినట్లుగా అనిపించింది. అయినా అతను వెనుకడుగు వెయ్యలేకపోయాడు.

మరొక అడుగు ముందుకేశాడు.

గులాబీల రేకులు ముళ్ళలాగా గుచ్చుకున్నాయి.

అతని మనసు బాధగా మూల్గింది!

అతనికి తను రోజూ నడిచే పూలబాట గుర్తుకొచ్చింది!

నిప్పులు చెరుగుతున్న ఎండలో కంకర రాళ్ళు గుచ్చుకునే ఆ బాట!

అరికాళ్ళు బీటెచ్చిన గ్లాసులా, బీడుపడిన నేలలా, చెట్టు కూలిన మోడులా — ఆ బాట మీద నడిచేవి.

తలమీద కట్టెల మోపును ఆ శరీరం మోస్తూ వుంటే, ఆ శరీరాన్ని ఈడ్చుకుంటూ ఆ కాళ్ళు భారంగా అడుగులు వేస్తుండేవి.

కన్నీళ్ళు ఇంకిన ఆ కళ్ళు ఈ పూల బాట వంక ఆశగా చూస్తుండేవి! ఆ బాట మీద తనెప్పుడు నడుస్తాడో!

ఆ రోజు రానే వచ్చింది!'

కాని, ఈ కొత్త అనుభవం మాత్రం అతను ఆశించిన దానికి వ్యతిరేకంగా వుంది!

అతని చూపు వెళ్ళినంత మేర ఎర్రగానే వుంది. రక్తం ఎరుపు. గులాబీలు ఎరుపు. అతడు తన అరికాళ్ళను చూసుకున్నాడు. అవీ ఎర్రగా మారాయి.

మరొక అడుగు ముందుకేశాడు.

కాలుతున్న అరికాలును మంచుగడ్డ మీద పెడితే ఎలా వుంటుందో అలా వుంది. ఒక్క అంగలో దాటి కుడికాలి మీద నుంచున్నాడు. కాళ్ళు కోసుకుపోతున్నాయి.

అతని కళ్ళలోంచి కన్నీటి చుక్కలురాలాయి. అతనికి ఆశ్చర్యం వేసింది. కన్నీళ్ళు ఇంకి పోయిన తన కళ్ళల్లోంచి కన్నీరు ఉబికి రావటం! ఆశ్చర్యమే మరి! అయినా, సాహసించి మరొక అడుగు ముందుకేశాడు. భరించలేని బాధ కలిగింది! ఛీ! పాడు పువ్వులు!

అతని సహనం అయిపోయింది. మరొక అడుగు ముందుకెయ్యడానికి సాహసించలేదు. మిగతావాళ్ళు మాత్రం అలవాటు ప్రకారం పూలబాట మీద నడుచుకుంటూ వెళ్తున్నారు. అతను మాత్రం లాగే వెనుతిరిగి వచ్చేశాడు.

పాడు బాట! పూల బాట!

అతనికి పూలబాట మీద నడుద్దామని ఒకప్పుడు అనుకున్న తన మీద తనకే కోపం వచ్చింది! ఈ పూలబాటమీద పరచిన పువ్వులు ఏమిటి? అణగారిన హృదయాలు? పరిమళ రాహిత్యపు సౌందర్యాలు? ఈ గులాబీలు ఎలాంటివి? హృదయాలలో తన ముళ్ళను గుచ్చి, రక్తాన్ని గ్రహించి, ముళ్ళను మాత్రం విడిచినవి. అందుకే ఈ ఎరుపు! ఛీ! పాడు గులాబీలు! అతనికి పరిమళరహిత పువ్వులు, శ్రమరహిత ఫలితం, బాధ్యతారహిత జీవితం అంటే అసహ్యం.

అతడు రోజూ నడిచే బాట మీద నడవసాగాడు.

ఎప్పటిలా ఎండ నిప్పులు చెరుగుతోంది. కంకర రాళ్ళబాటలోనూ మార్పులేదు. అయితే అతని మనసు మాత్రం మారినట్టుంది. అతనికి నడక ఇక ఆహ్లాదకరంగా వుంది. నెత్తి మీద కట్టెల మోపు బరువుగా తోచడం లేదు!

అంకితం

*స్వర్గీయ గుడిపాటి వెంకటాచలంగారి స్మృతికి!*